

రుషికొండ ప్యాలెస్ వినియోగానికి చర్యలు

విశాలాంధ్ర - పీఎం పాలెం: విశాఖలో వైసీపీ హయాంలో నిర్మించిన రుషికొండ ప్యాలెస్‌లను వినియోగంలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే కేబినెట్ మంత్రుల బృందం భేటీ అయ్యారు. ఈ భవనాలను ఎలా ఉపయోగించాలో ప్రజల నుంచి సలహాలు, సూచనలను పర్యాటకశాఖ ఆహ్వానించింది. టూరిజం అథారిటీ సీఈవో ఆమ్రపాలి ఆదివారం ఈ విషయాన్ని తెలియజేశారు. సూచనలను rushikonda@aptdc.inకు మెయిల్ చేయాలని పర్యాటక శాఖ సూచించింది.

2047 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా విశాఖ అభివృద్ధి

- ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం
- డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ప్రారంభం అనంతర కార్యక్రమంలో మంత్రి లోకేష్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ఏపీ ఆర్థిక రాజధానిగా విశాఖను తీర్చిదిద్దుతామని, 2047 నాటికి విశాఖ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మారుతుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖలో మొదటి ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు శంకుస్థాపన అనంతరం రిషికొండలోని ఏ1 గ్రాండ్ కన్వెన్షన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్ర మంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ఇక్కడున్న ఐటీ ప్రొఫెషనల్స్‌కు, సీఈవోలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 1990లో పలు ఐటీ సంస్థలు హైదరాబాద్‌కు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సైబర్ టవర్స్‌ను నిర్మించారని, దీనివల్ల అనేక సంస్థలు హైదరాబాద్‌కు వచ్చాయన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి 30 ఏళ్లు పైనే పట్టిందని, విశాఖకు పదేళ్లకు మించి పట్టదన్నారు. మంతెన రామరాజు, ఎన్ఆర్ఐ టీడీపీ నేత సాగర్ దొడ్డపనేని, కాటంనేని భాస్కర్ ఈ ప్రాజెక్ట్ ను విశాఖపట్నానికి తీసుకురావడంలో ఎంతో కీలకపాత్ర పోషించారన్నారు. ఈ ప్రాజెక్ట్ వెనుక ఎంతో మంది కృషి ఉందని, గ్రేటర్ విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ 2047 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మారుతుందన్నారు. ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానమని, ప్రజలు ఆ విధంగానే ఎన్నికల్లో తీర్పు ఇచ్చారన్నారు. గత 17 నెలల్లో ఏపీకి వచ్చిన 120 బిలియన్ డాలర్ల పెట్టుబడుల్లో 50 శాతం కంటే ఎక్కువగా గ్రేటర్ విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్‌కు వచ్చాయని, దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ విశాఖకు వస్తోందన్నారు. ఏపీ ఆర్థిక అజెండాకు ప్రధాని నరేంద్ర మోదీ సహకరిస్తున్నారని, కేంద్రం చేపట్టే ఆర్థిక సంస్కరణల్లో ఏపీకి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోగలిగామని, కేంద్రం స్టీల్ ప్లాంట్‌కు రూ.11వేల కోట్ల సాయం చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం రూ.3వేల కోట్లు అందించిందన్నారు. మూడు ఫర్నేస్‌లు ఇప్పుడు

పనిచేస్తున్నాయని, వంద శాతం సామర్థ్యంతో నడిపి ప్లాంట్‌ను లాభదాయకంగా మారేలా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఫీ ఛైర్మన్ రాజు వేగేశ్న, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్స్ హర్షా రామ్, రాజేష్ తిరుమల రాజు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఎమ్మెల్యే పెన్మత్స విష్ణుకుమార్ రాజు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, ఐటీ కమ్యూనికేషన్ అండ్ ఎలక్ట్రానిక్స్ సెక్రటరీ కాటంనేని భాస్కర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిషోర్, ఇతర ఉన్నతాధికారులు ఎస్.యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ స్టేడియంలో తినుబండారాల ధరల మోత

టికెట్ ధర కన్నా.... స్నాక్స్ ధర అధికం... ప్రేక్షకుల జేబులు ఖాళీ....

విశాలాంధ్ర - పీఎం పాలెం: క్రికెట్ స్టేడియం వేదికగా ఏ తిను బండారం వస్తువులు అయినా 100 రూపాయలే. చివరికి నీటి బాటిల్ కూడా అదే ధర వసూళ్లు చేయడంతో క్రీడాభిమానులు జేబులు ఖాళీ అయ్యాయి. విశాఖలో ఏ క్రికెట్ మ్యాచ్ జరిగినా స్నాక్స్ అమ్మే ఏజెన్సీ వ్యాపారు లకు పండగే. ఏసీఏ అధికారులు, నిర్వాహకులు ఈ వ్యాపారులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడంతో వారి ధరల దందాకు అడ్డే లేకుండా పోయింది. బయట మార్కెట్‌లో దొరికే ఏ వస్తువు అయినా స్టేడియం లోపల 100 శాతం అదనపు ధరలు పలుకుతున్నాయి. క్రికెట్ సంబరం కోసం వచ్చిన ప్రేక్షకులకు జేబు ఖాళీ అయిపోయింది. క్రికెట్ చూద్దామని వచ్చే ప్రేక్షకులకు ధరల మోత దడ పుట్టించింది. ఈ క్రికెట్ మ్యాచ్‌కు టికెట్ ధర 150 రూపాయలు ఉండగా, రెండు సమోసాలు వంద రూపాయలు, కూల్ డ్రింక్, లేస్ ప్యాకెట్, ఐస్ క్రీమ్, ఇలా ఏ వస్తువు కొనుగోలు చేసినా 100 కాగితం ఇచ్చేయాల్సిందే. ఇదెక్కడి ధరల మోత అంటూ ప్రేక్షకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏసీఏ నిర్వాహకులు వ్యాపారుల ధరల నియంత్రణపై దృష్టి చారించాలని ప్రేక్షకులు కోరారు.

మూతబడ్డ రైతు సేవా కేంద్రం..!

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని వెల్లంకిలో గల రైతు సేవ కేంద్రం గత రెండు నెలలుగా మూతపడి ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కేంద్రంలో నియమించబడ్డ వ్యవసాయ శాఖ సిబ్బంది గైర్హాజర్ కావడంతో మూసిన తలుపులతో సేవా కేంద్రం భవనం దర్శనమిస్తుంది. ఈ పంచాయతీ పరిధిలో గారి పేట, బొడ్డపాలెం, వెల్లంకి -1, వెల్లంకి-2 గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ 70 శాతం మంది రైతులే ఉన్నారు. అసలే ఖరీఫ్ సీజన్ ఆరంభం కావడంతో రైతులకు విత్తనాలు, ఎరువులు అవసరంతోపాటు వ్యవసాయ సలహాలు కూడా కావాలి. ఈ నేపథ్యంలో సిబ్బంది విధులకు డుమ్మా కొట్టడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ కోసం మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి ఉందా

విశాలాంధ్ర - గాజువాక : అధికారంలో ఉన్నంతకాలం గంగవరం పోర్టును అదానికి అప్పజెప్పి అనుక్షణం స్టీల్ ప్లాంట్ కర్మాగారాన్ని ప్రైవేటుకరం చేయాలని దాని భూములను అమ్ముకోవాలని కుట్రపన్నిన ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారం కోల్పోవడంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ఇప్పుడు ప్రైవేటీకరణ అంటూ గగ్గోలు పెడుతూ మొసలి కన్నీరు కారుస్తున్నారని రాష్ట్ర ఏపీ ఐఐసి డైరెక్టర్ గాజువాక నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గాజువాక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షులు కనిరెడ్డి ఆంజనేయ అధ్యక్షతన నియోజకవర్గ టీఎన్‌టీయూసీ సమావేశంలో మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ కర్మాగారాన్నే ఆదుకున్న ఘనత రెండుసార్లు కూటమి కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చొరవతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు, గాజువాక నియోజకవర్గం శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, విశాఖపట్నం శ్రీభరత్ ఆధ్వర్యంలో సుమారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 14 వేల కోట్ల రూపాయల పైచిలుకు తీసుకువచ్చి విశాఖ ఉక్కును పరిరక్షించామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్ టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి నమ్మి సింహాద్రి, గాజువాక నియోజకవర్గం టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి కోన సోమనాయుడు, జిల్లా టీఎన్‌టీయూసి నాయకులు నంబరు పెద్దదేవుడు, గాజువాక నియోజకవర్గం టిఎన్టియుసి నాయకులు లంక జగన్నాథం, దేవర బోయిన సుబ్రహ్మణ్యం గెద్దాడ ప్రసాద్ చొప్ప నూకరాజు, కోరికన చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో మంత్రి నారా లోకేష్ సందడి

- స్టేడియం 'ఏ-గ్యాలరీ స్టాండ్'కు మిథాలిరాజ్ పేరు
- మూడో నంబర్ గేట్‌కు రావి కల్పన పేరు..
- స్టాండ్ ఆవిష్కరణలో కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి లోకేష్
- భారత్ - ఆస్ట్రేలియా మధ్య మహిళల వన్డే ప్రపంచకప్ మ్యాచ్‌ను వీక్షించిన మంత్రి

విశాలాంధ్ర - పీఎం పాలెం: విశాఖ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సందడి చేశారు. విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ పేరుతో 'ఏ-గ్యాలరీ స్టాండ్'తోపాటు మరో క్రికెటర్ రావి కల్పన పేరుతో 'మూడో నెంబర్ గేట్'ను ఐసీసీ ఛైర్మన్ జై షాతో కలిసి మంత్రి నారా లోకేష్ లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీసీఐ అధ్యక్షులు మిథున్ మన్హాస్, ఏసీఏ అధ్యక్షులు కేశినేని శివనాథ్, ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ పాల్గొన్నారు. అనంతరం భారత్ - ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న మహిళల వన్డే ప్రపంచ కప్ మ్యాచ్‌ను జై షాతో కలిసి మంత్రి నారా లోకేష్ వీక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బిసిసిఐ సెక్రటరీ దేవజిత్ సైకియా, ఏసీఏ ప్రెసిడెంట్, ఎంపీ కేశినేని శివనాథ్, ఏసీఏ సెక్రటరీ రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, మిథాలీ రాజ్ పేరుతో ఏర్పాటు చేసిన ఎ గ్యాలరీ స్టాండ్, రావి కల్పన పేరుతో ఏర్పాటు చేసిన మూడో గేట్ ఆవిష్కరించిన ఐసీసీ ఛైర్మన్ జైషా మహిళా క్రికెట్ దిగ్గజాలు మిథాలీ రాజ్, రావి కల్పనలకు అరుదైన గౌరవం దక్కింది. ఏసీఏ నిర్ణయం పట్ల క్రికెట్ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

విశాఖ దశాదిశ మారేలా అభివృద్ధి ప్రణాళికలు

ప్రజాప్రతినిధులకు, అధికారులకు మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: భవిష్యత్తును, రాబోయే కాలంలో చోటు చేసుకునే మార్పులను, అవసరాలను దృష్టిలో పెట్టుకొని విశాఖ దశాదిశ మారేలా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రజాప్రతినిధులను, అధికారులను ఆదేశించారు. బెంగళూరు, పుణెలాంటి నగరాల్లో ఉండే ట్రాఫిక్ సమస్యలు ఇక్కడ ఉత్పన్నం కాకుండా చూడాలని, విస్తారమైన రోడ్లను అభివృద్ధి చేయాలని సూచించారు. విశాఖ వేదికగా బోలెడన్ని కంపెనీలు వస్తున్నాయని, దానికి తగ్గట్టుగా మాస్టర్ ప్లాన్లు సిద్ధం చేసుకొని ముందుకు వెళ్లాలని హితవు పలికారు. ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలెక్టరేట్ మీటింగు హాలులో ఆదివారం ప్రత్యేకంగా సమావేశమైన ఆయన విశాఖ, అనకాపల్లి, విజయగరం, శ్రీకాకుళం జిల్లాలతో కూడిన రీజియన్ అభివృద్ధి, ఇతర అంశాలపై సంక్షిప్తంగా సమీక్షించారు. ముప్పై ఏళ్ల భవిష్యత్తును ఊహించి ప్రణాళికలు రూపొందించాలని, ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయంతో కూడిన మేధోపరమైన చర్చ జరగాలని మంత్రి పేర్కొన్నారు. వివిధ కంపెనీలు, అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కాబోతున్న ఈ రీజియన్‌లో 5 లక్షల ఉద్యోగాలు యువతకు కల్పించటమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, కావున ఇక్కడి నేతలు, అధికారులు సరైన విధంగా ఆలోచించి ప్రణాళికలు తయారు చేయాలని నిర్దేశించారు. ప్రజలకు ఇబ్బంది లేని విధంగా మిషన్ మోడ్‌లో అభివృద్ధి జరగాలని, వారి ఆమోదయోగ్యమైన విధంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ సెక్రటరీ కాటమనేని భాస్కర్, శాసన సభ విప్ గణబాబు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, ఏపీ గ్రోవర్స్ ఆయిల్స్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండిబాబ్జీ, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లు విజయ కృష్ణన్, రాంసుందర్ రెడ్డి, స్వప్నిల్ దినకర్ పుండర్కర్, వి.ఎం.ఆర్.డి.ఎ. కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, విశాఖపట్నం జేసీ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లతో అధికారంలోకి బీజేపీ

కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక దండి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు ఈగల మోహన్ సాయి, వంటాకు వినోద్ ఆధ్వర్యంలో మద్దిలపాలెం, కృష్ణ కాలేజీ రోడ్డులో ఏఐసీసీ పిలుపు మేరకు రాహుల్ గాంధీకి మద్దతుగా ఓట్ చోర్, గద్దె చోడ్ అని నినాదాలు ఇస్తూ బీజేపీ , కేంద్ర ఎన్నికల సంఘం కలిసి చేస్తున్న కుట్రని ప్రజలకు వివరిస్తూ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రియాంక దండి పాల్గొని దేశంలో ఈసీ సహాయంతో బీజేపీ ఓట్ చోర్ చేసి అధికారంలోకి వస్తోందని, దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఇది అమలు చేస్తోందన్నారు. బీజేపీకి బలం లేని రాష్ట్రాల్లో మిత్రపక్షాలకు పూర్తిగా సహకరిస్తూ ఓట్ చోరీ చేసి అధికారం కైవసం చేసుకుంటున్నారని, మన రాష్ట్రంలో బీజేపీకి 0.5% ఓట్ బ్యాంకు మాత్రమే ఉందని కాని గత ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 8 అసెంబ్లీ, 3 పార్లమెంట్ స్థానాలు గెలుచుకుందన్నారు. ఓట్లు చోరీ చేసి, ఎన్నికల్లో బీజేపీ గెలుస్తోందన్నారు. ప్రజా స్వామ్యాన్ని, ప్రజల హక్కులను బీజేపీ కాల రాస్తోందని, ఇప్పటికే దేశ వ్యాప్తంగా యువత మోదీ అంటే ఓట్ చోర్ అని అంటున్నారని, మీ ఓటు జాగ్రత్తగా కాపాడుకోవాలి, బీజేపీ ఎన్నికల సంఘం మీ ఓటు కూడ దొంగలిస్తుందని అన్నారు. పారదర్శకంగా ఉండాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం మోదీ జేబు సంస్థగా వ్యవహరిస్తోందని, బీజేపీ చెప్పినట్టు ఎన్నికల సంఘం ఆడుతోందని ప్రియాంక విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా నాయకురాలు కాండవ గాయత్రి, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ ఆలీ, 15వ వార్డు అధ్యక్షులు వేమూరి సురేష్, 27వ వార్డు అధ్యక్షులు గుర్రం కనకరాజు, 28వ వార్డు అధ్యక్షురాలు మామిడి వరాలమ్మ, 18వ వార్డు అధ్యక్షులు భోగవరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయుని కుటుంబానికి ఆర్థికసాయం

విశాలాంధ్ర - భీమిలి: భీమునిపట్నం మండలం కె.దిబ్బడిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి జూన్ నెలలో బదిలీలలో ఎస్.రాయవరం మండలానికి వెళ్లిన ఉపాధ్యాయుడు వంకల సత్యం గత నెల 20వ తేదీన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విశాల హృదయంతో నిస్వార్థమైన సహాయం చేయడానికి ముందుకొచ్చిన కొంతమంది భీమునిపట్నం ఉపాధ్యాయులు, పి.ఆర్.టి.యు సభ్యులు అతని కుటుంబానికి అండగా కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడు డా.గాదె శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో జిల్లా పి.ఆర్.టి.యు నాయకులు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, గరికిన పరదేశి, సన్యాసినాయుడు, రొంగలి అప్పారావు, ఆల్బర్ట్ సుదర్శన్, భీముని పట్నం పి.ఆర్.టి.యు నాయకులు ఎస్.రమణారావు, రెడ్డిపల్లి అప్పలరాజు, ఎం.రమా దేవి, వెంకటరమణ తదితరులు ఆర్థిక సహాయాన్ని సత్యం భార్యకు అందజేశారు.

ఘనంగా సమాచార హక్కు చట్టం వేడుకలు

విశాలాంధ్ర - భీమిలి: సమాచార హక్కు చట్టం 2005 అమలులోకి వచ్చి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భీమునిపట్నం మండలం గొల్లలపాలెం గ్రామంలో ఉన్న కస్తూరీబా గాంధీ బాలికల విద్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ సంస్థల నుండి భారత పౌరులకు సమాచారాన్ని పొందేందుకు హక్కును ఇచ్చిన చట్టం అని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, అవినీతిని నిరోధించడానికి ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య జవాబుదారీతనం పెంచడం ఈ చట్టం ఉద్దేశ్యమని సమగ్ర శిక్షా జిసిడివో శ్రీదేవి, ఎల్ఎస్‌టీఏఎల్ఎస్‌టీ శ్రీనివాస రావు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాస రచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ గంగా కుమారి తెలియజేశారు.

బీవీకే కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలోని బీవీకే కళాశాల ఇంటర్‌మీడియట్ సీఈసీ 1979-81 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం హోటల్ బెజ్‌కృష్ణలో జరిగింది. ఈ సందర్భంగా 30 మంది పూర్వ విద్యార్థులు ఒకచోట కలుసుకుని ఆనందోత్సహాల మధ్య గడిపారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు డివి సూర్యారావు, జేవీఎస్ఎన్ మూర్తి, సి.వెంకటరావులు పాల్గొన్నారు. అధ్యాపకులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. విద్యార్థులు వారు చదువుకున్న సమయంలో జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వి.వెంకట అప్పారావు, ఏఎస్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నీరుకు దారేది...?

- ఈ నిర్లక్ష్యానికి ఎవరు బాధ్యులు..?
- డ్రైనేజ్ వాటర్‌తో రోడ్డు జలమయం
- వాహనదారులకు తప్పని తిప్పలు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం వెల్లంకి గ్రామ పంచాయతీకి అనుసంధానంగా ఉన్న జాతీయ రహదారి వద్ద రోడ్డు గత వారం రోజులుగా జలమయమై ఉంది. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో రోడ్డుపైనే నీరు చెత్తాచెదారంతో పేరుకుపోయి ఉంది. దానికి తోడు ప్రముఖ విద్యాసంస్థ నుండి వాడుకొని వదిలేస్తున్న వ్యర్థపు నీరు రోడ్డుపైనే దర్శనమిస్తుంది. మురుగునీరు వర్షపు నీరు తీవ్రంగా కలుషితమై వాహనదారులకు తరచూ ఇబ్బందులకు గురి చేస్తుందని చెప్పవచ్చు. సుమారు 200 మీటర్ల దూరం వరకు మురుగునీటిలో వాహనదారులు, ప్రజలు ప్రయాణాలు సాగిస్తూ నిత్యం నరకయాతన పడుతున్నారు. అనేకమార్లు ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ఈ వ్యర్థపు నీరు బయటకు పోయే వెసులుబాటు చర్యలను అధికారులు చేపట్టలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యాసంస్థ పాఠశాల ప్రక్కపక్కనే ఉండడం వారు వాడుకొని వదిలేసిన నీరు వెళ్లడానికి పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి లేకపోవడం వల్ల ఈ నీరంతా రోడ్డుపైనే చెరువు వలే ప్రవహిస్తుంది. ఇక్కడ సుదీర్ఘకాలంగా ప్రధాన సమస్య ఉన్నప్పటికీ అధికారులు నాయకులు పట్టించుకోవడంలేదని మురుగునీరు పోయేందుకు ప్రత్యేక చొరవ తీసుకుని సమస్య పరిష్కారం చేయాలని వాహనదారులు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏయూ న్యాయ కళాశాలలో జస్టిస్ రామస్వామి చిత్రపటం ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.రామస్వామి చిత్రపటాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ ఆవిష్కరించారు. అదేవిధంగా గతంలో జస్టిస్ కె.రామస్వామి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పబ్లిక్ పవర్ అండ్ జ్యూడిషియల్ ఫంక్షన్ అనే అంశంపై అందించిన ప్రసంగాన్ని పున: ముద్రించిన పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ బట్టు దేవానంద్ మాట్లాడుతూ మహెూన్నత వ్యక్తిత్వం జస్టిస్ కె.రామస్వామి సొంతమని అన్నారు. జస్టిస్ రామస్వామి పేరు మీద వారి కుటుంబ సభ్యులు స్మారక ప్రసంగం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఏయూ వైస్ చాన్సలర్ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ఎందరో న్యాయ కోవిదులను సమాజానికి అందించిందని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.రాంబాబు, న్యాయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సీతారత్నం, జస్టిస్ రామస్వామి కుమార్తె డాక్టర్ జయ, కుటుంబ సభ్యులు ఐశ్వర్య, గార్గి, సుభాంగ్ జోషి, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ కళాశాల విశ్రాంత ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన డా. ఎం.వి.వి.ఎస్. మూర్తి మూట్ కోర్ట్ పోటీలు

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకులు స్వర్గీయ డా. ఎం.వి.వి.ఎస్.మూర్తి పేరిట గీతం న్యాయ కళాశాల ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి 6వ వర్చువల్ మూట్ కోర్ట్ పోటీ 2025 ముగిశాయి. దేశవ్యాప్తంగా ఉన్న నేషనల్ లా యూనివర్సిటీలు, ప్రభుత్వ, ప్రైవేట్ న్యాయ విద్యా సంస్థల నుండి 42 బృందాలు ఈ పోటీలో పాల్గొన్నాయి. ఈ ఏడాది "నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్స్టెన్సెస్ (ఎన్.డి.పి.ఎస్) చట్టం" ఆధారంగా నిర్వహించిన పోటీలలో కటక్ (ఒరిస్సా)కు చెందిన మధుసూధన్ న్యాయ కళాశాల ప్రథమస్థానంలో నిలువగా, కర్ణాటకకు చెందిన క్రిస్ట్ డీమ్డ్ విశ్వవిద్యాలయం రన్నరప్‌గా ద్వితీయ స్థానంలో నిలిచింది. ఉత్తమ రీసెర్చర్ అవార్డు పూణెకు చెందిన సింబయాసిస్ న్యాయ కళాశాల, ఉత్తమ స్పీకర్ అవార్డు ప్రయాగరాజ్‌కు చెందిన షంబూనాధ్ న్యాయ కళాశాల, ఉత్తమ మెమోరియల్ అవార్డును తమిళనాడుకు చెందిన శస్త్ర డీమ్డ్ విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల కైవశం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయ మూర్తి జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులు ముఖ్య అతిధిగా హాజరై విజేతలను అభినందిందించారు. కార్యక్రమంలో జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు వి.ఆర్.బద్రినాథ్ నందులా, గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, గీతం న్యాయకళాశాల డీన్ ప్రొఫెసర్ ఎ.రాజేంద్ర ప్రసాద్, డైరక్టర్ డా. చల్లా లక్ష్మణరావు, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ ఎల్.ఆశిష్ కుమార్, గీతం లా స్కూల్ ఫ్యాకల్టీ, సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర పేజి 2 విశాఖపట్నం
సోమవారం 13, అక్టోబర్ 2025

ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో మిథాలీ రాజ్ స్టాండ్, రావి కల్పనా గేట్ ప్రారంభం

విశాలాంధ్ర - పీఎం పాలెం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆదివారం మహిళల క్రికెట్‌లో అత్యున్నత విజయాలు సాధించిన మహిళ క్రికెటర్లు మిథాలీ రాజ్, రావి కల్పనలకు ఘనంగా గౌరవించింది. విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో ఎ గ్యాలరీ స్టాండ్‌కు మిథాలీ రాజ్ పేరు, మూడో గేట్‌కు రావి కల్పన పేరుతో ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఐసిసీ చైర్మన్ జయ్ షా, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, క్రికెట్ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ వేడుకకు ఐసిసీ సి.ఈ.వో సంజోగ్ గుప్తా, క్రికెట్ ఆస్ట్రేలియా చైర్మన్ మైక్ బైర్డ్, ఆస్ట్రేలియా సీఈవో టాడ్ గ్రీన్‌బర్గ్ కూడా హాజరయ్యారు. బిసిసిఐ అధ్యక్షుడు మిథున్ మన్‌హాస్, కార్యదర్శి దేవజీత్ సైకియా, సంయుక్త కార్యదర్శి ప్రభ్‌తేజ్ భాటియా కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏసీఏ తరపున కార్యదర్శి సానా సతీష్ బాబు, ఉపాధ్యక్షుడు బండారు నరసింహారావు, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి బి.విజయ్ కుమార్‌లతోపాటు కౌన్సిలర్ దంతు గౌర్ విష్ణుతేజ్

హాజరయ్యారు. భారతదేశంలో అత్యంత ప్రఖ్యాతి గాంచిన మహిళా క్రికెటర్ మిథాలీ రాజ్ మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లలో ముందున్నారు. ఆమె మొత్తం 10,868 పరుగులు చేశారు. ఇందులో 7 శతకాలు, 85 అర్ధశతకాలు ఉన్నాయి. 1999లో అంతర్జాతీయ క్రికెట్‌కు అరంగేట్రం చేసిన మిథాలీ, భారత జట్టును రెండు వన్డే వరల్డ్ కప్ లో ఇండియా టీమ్ ను ఫైనల్స్‌కు తీసుకురావటంలో కీలక పాత్ర పోషించింది. అంతేకాకుండా, 150కి పైగా వన్డే మ్యాచ్‌లకు నాయకత్వం వహించిన ఏకైక భారత మహిళా క్రికెటర్ గా మిథాలీ రాజ్ రికార్డ్ క్రియేట్ చేశారు..23 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఆమె చూపిన నిబద్ధత, స్థిరత్వం, మరియు నాయకత్వం ఆమెను చారిత్రక వ్యక్తిగా నిలిపాయి. మంత్రి నారా లోకేశ్ మిథాలీకి ఏసీఏ లోగోతో కూడిన లిమిటెడ్ ఎడిషన్ హ్యాండ్‌క్రాఫ్ట్ చేసిన వెండి క్రికెట్ బంతిని బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ "మిథాలీ రాజ్ అనేది కేవలం పేరు కాదు ఒక బ్రాండ్ అని ఆమె అద్భుతమైన క్రికెటర్ మాత్రమే కాదు, దేశంలోని లక్షలాది యువతులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఏ సి ఏ వి డి సి ఏ స్టేడియంలో ఆమె పేరు మీద స్టాండ్ ఉండటం రాష్ట్రానికి గర్వకారణం అన్నారు. రాష్ట్రం నుండి వందలాది మిథాలీలు రావాలని, దేశానికి సేవ చేయాలంటూ ఆకాంక్షించారు. ఐసిసీ చైర్మన్ జయ్ షా మాట్లాడుతూ మిథాలీ రాజ్ ఇండియాలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్‌ను ప్రభావితం చేసిందన్నారు. ఎంతో మంది మహిళ క్రికెటర్లకు స్ఫూర్తిగా, ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ స్టేడియంలో ఎ గ్యాలరీకి ఆమె పేరు పెట్టడంతో సరైన గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ఈ ప్రోత్సాహంతో మహిళలు క్రికెట్‌ను ఎంచుకుని రాబోయే తరం క్రికెటర్లుగా ఎదగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఏసీఏ అధ్యక్షుడు కేసినేని శివనాథ్ మాట్లాడుతూ వుమెన్స్ క్రికెట్‌లో లెజెండ్ మిథాలీ రాజ్ ను గౌరవించటం ఏసీఏ అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆమె పేరు మీద స్టాండ్ ఏర్పాటు చేయడం ఏసీఏకి గర్వకారణంగా పేర్కొన్నారు. అనంతరం మిథాలీ రాజ్ స్పందిస్తూ వైజాగ్‌లో తన పేరు మీద స్టాండ్ ఏర్పాటు చేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ గుర్తింపు ఇచ్చినందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, ఏసీఏకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నగరం నా ఎదుగుదలకి కేంద్ర బిందువుగా నిలిచిందని, మహిళల క్రికెట్ ఎంత అభివృద్ధి చెందిందో చూసి ఎంతో ఆనందంగా ఉందన్నారు. రావి కల్పనా మాట్లాడుతూ ఇదంతా తనకి ఒక కలలా అనిపిస్తుందన్నారు. తన కెప్టెన్ మిథాలీ దిదీతో కలిసి గౌరవం పొందుతానని కలలో కూడా ఊహించలేదన్నారు. మంత్రి నారా లోకేష్, ఏసీఏకి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రానికి చెందిన మహిళా క్రికెట్ క్రీడాకారులు రాబోయే రోజుల్లో దేశానికి పేరు తెస్తారన్న నమ్మకం ఉందన్నారు.

బాల వికాస్ విద్యార్థులకు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర - ఆనందపురం: శ్రీ సత్య సాయి ఆదర్శ గ్రామం గొట్టిపల్లి ఇంటిగ్రేటెడ్ సేవా మందిరంలో ఆదివారం శ్రీ సత్యసాయి సేవా సంస్థలు విశాఖపట్నం జిల్లా విద్యా విభాగం, హెచ్ఎస్‌బిసి ఎంప్లాయిస్ అసోసియేషన్ సంయుక్తంగా 45 మంది బాలవికాస్ విద్యార్థులకు తెల్ల ఏక రూప దుస్తులను, స్వెటర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా బాల వికాస్ కోఆర్డినేటర్ జయ మల్లాది బాల వికాస్ విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉన్న స్థాయికి ఎదగాలన్నారు. రాష్ట్ర వేదం ఇన్‌చార్జ్, హెచ్ఎస్‌బిసి ఉద్యోగస్తుల అసోసియేషన్ ప్రతినిధి ఐఎస్ గోపికృష్ణ మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి స్ఫూర్తితో తమ అసోసియేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో బాల వికాస్ జిల్లా రిసోర్స్ పర్సన్‌లు వి.పద్మ, రాజు విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి సేవా సంస్థలు విశాఖపట్నం జోన్ కోఆర్డినేటర్ మానాపురం సత్యసాయి కుమార్, మాజీ సర్పంచ్ కోరాడ నాయుడు బాబు, ఆదర్శ గ్రామం కోఆర్డినేటర్ డబ్బీరు విజయ్ కుమార్, కన్వీనర్ కోరాడ తమ్మనాయుడు, డిపి రాజు, బాలవికాస్ కోఆర్డినేటర్ డబ్బీరు. వెంకట సంతోష్ కిరణ్, సీనియర్ సేవాదళ్ వత్సవాయి కృష్ణమూర్తి రాజు, అందుకూరి కుమార్, సేవాదళ్ కోఆర్డినేటర్ డి.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మలేషియా అయ్యప్పస్వామి సేవా కాన్ఫరెన్స్‌లో గాడు తాతినాయుడు

విశాలాంధ్ర - భీమిలి: మలేషియా కౌలాలంపూర్ రాష్ట్రంలో మలేషియా శ్రీ అయ్యప్పస్వామి సేవా సంఘం (మాస్) నిర్వహించిన అయ్యప్పసేవా కాన్ఫరెన్స్ కార్యక్రమంలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ కార్యదర్శి గాడు తాతి నాయుడు పాల్గొన్నారు. శబరిమల అయ్యప్పస్వామి సంబంధిత కార్యకలాపాలన్నీ అనవసరమైన రాజకీయ జోక్యం కాకుండా ట్రావెన్ కోర్ దేవశ్వం బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించడం ద్వారా అయ్యప్ప భక్తులు విశ్వాసం చూడగలం అని అట్లా కాకుండా అనవసర రాజకీయ జోక్యంవలన ప్రపంచవ్యాప్తంగా ఉన్న అయ్యప్ప భక్తులను నిజంగా ఆందోళన కలిగిస్తునట్లు, గ్లోబల్ అయ్యప్ప సంగమం అనేది స్వాగతించదగిన అంశం అని తెలిపారు. ఈ సమావేశం అందరినీ ఒకచోట చేర్చి ఫిర్యాదులను విని అనేక ఆకాంక్షలను నెరవేర్చగలదని సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో మలేషియా

అయ్యప్పస్వామి దేవస్థానం అధ్యక్షులు ఉజ్వల కుప్పుస్వామి, మలేషియా ఫార్మర్ మినిస్టర్, ఎ కోహిలాన్ పిళ్లేయాశబరిమలై అయ్యప్పస్వామి దేవస్థానం నంబూద్రిలు బ్రహ్మశ్రీ దామోదరన్ పొట్టి, బ్రహ్మశ్రీ శ్రీవలసశర్మ, బ్రహ్మశ్రీ మురళి ధరన్, బ్రహ్మశ్రీ ఎంఎన్ కృష్ణన్, బ్రహ్మశ్రీ ఎమ్మెస్ పరమేశ్వరన్, ఏబీఏపీ జాతీయ అధ్యక్షులు అయ్యప్పదాస్, జాతీయ కార్యదర్శి గాడు తాతినాయుడు, గురుస్వామి శ్రీమణికంఠ స్వీట్స్ బేకరీ అధినేత అధిమూలం నాగరాజు, కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. తదుపరి శబరిమల మున్ మేళ్ శాంతులు ఆధ్వర్యంలో అరుల్మిగు శ్రీ అయ్యప్పస్వామి వారికి పడిపూజా కార్యక్రమం నిర్వహించారు. తదుపరి స్వామి వారి అన్నప్రసాద వితరణ చేపట్టారు. మలేషియా శ్రీ అయ్యప్ప స్వామి సేవా సంఘం వారి తరుపున కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నంబూద్రిలకు, ఏబీఏపి జాతీయ అధ్యక్షులు, కార్యదర్శి, కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి మెమొంటోలు అందజేశారు.

గవాయ్‌పై దాడిని ఖండిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో రాస్తారోకో

విశాలాంధ్ర - భీమిలి : ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడిని ఖండిస్తూ మాల మహానాడు నియోజకవర్గ కన్వీనర్ బోని సన్నిబాబు ఆధ్వర్యంలో తాళ్లవలస అంబేద్కర్ కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు, బోని సన్నిబాబు, సియ్యాద్రి రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి భాగం గోపాలరావు మాట్లాడుతూ భారతదేశంలో

అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని దేశసార్వభౌమాధికారంపై దాడిగా అభివర్ణించారు. ప్రధాన న్యాయమూర్తి దళితుడైనందున సనాతన ధర్మం పేరుతో కిషోర్ అనే న్యాయవాది బూటుతో దాడి చేశారని అదే స్థానంలో ఓసి న్యాయమూర్తి ఉంటే దాడి చేయగలరా అని ప్రశ్నించారు? దాడి చేసిన న్యాయవాదిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ప్రయోగించి అరెస్టు చేయాలని, అలాగే అతని సభ్యత్వాన్ని శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రానికి సంబంధించిన హర్యానా క్యాడర్ అడిషనల్ డీజీపీ పురాన్ కుమార్‌పై అవినీతి ఆరోపణలతో కుట్ర చేసి ఇరికించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన పోలీస్ ఉన్నతాధికారులపై చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే ఒక అడిషనల్ డిజిపి స్థాయి అధికారి మరణిస్తే

అతనికంటే చిన్న కేడర్ అయిన ఐజి స్థాయి అధికారితో సిట్ వేయడం ఎంతవరకు న్యాయమని ఎద్దేవా చేశారు. పై రెండు సంఘటనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని సనాతన ధర్మం పేరుతో దళితులపై జరుగుతున్న దాడులను ఆపాలని దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని ఎస్సీ ఎస్టీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు బోని ప్రసాద్, బెల్లన అప్పారావు, బోని నర్సింగరావు, యాగాటి రామారావు, మామిడి భాస్కరరావు, బోని శివ, మట్ట ఆదినారాయణ, లంక పైడ్రాజు, బోనీ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.52 కోట్ల విలువ కలిగిన తొలి ప్రధాన సోలార్ రూఫ్‌టాప్ ఆర్డర్‌ను పొందిన క్రాంప్టన్

విశాలాంధ్ర - విశాఖపట్నం: క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (క్రాంప్టన్), భారతదేశంలోని ప్రముఖ కన్స్యూమర్ ఎలక్ట్రికల్ కంపెనీల్లో ఒకటి, ఈ రోజు తెలంగాణ మార్కెట్లో తన మొదటి ప్రధాన సోలార్ రూఫ్‌టాప్ ఆర్డర్‌ను రూ. 52 కోట్లతో సాధించడం ద్వారా ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. ఈ వ్యూహాత్మక చర్య, క్రాంప్టన్ బ్రాండ్ యొక్క నమ్మకమైన మరియు బలమైన పంపిణీ నెట్‌వర్క్ ద్వారా స్థిరమైన ఇంధన పరిష్కారాలలో వృద్ధిని ముందుకు నడిపించడంపై కంపెనీ నిబద్ధతను హైలైట్ చేస్తుంది. 20% కంటే ఎక్కువ వేగంతో వృద్ధి చెందుతున్న రూ. 20,000, రూ.25,000 కోట్ల పెద్ద మరియు విస్తరిస్తున్న సోలార్ రూఫ్‌టాప్ మార్కెట్‌ను క్రాంప్టన్ సమర్థవంతంగా ప్రభావితం చేయడానికి సన్నద్ధంగా ఉంది. ఈ గణనీయమైన విజయం పెద్ద సోలార్ రూఫ్‌టాప్ విభాగంలో క్రాంప్టన్ యొక్క వ్యూహాత్మక ప్రవేశాన్ని ప్రతిబింబిస్తూ, భారతదేశ సౌర శక్తి మార్కెట్లో కంపెనీని విశ్వసనీయ మరియు నమ్మదగిన సంస్థగా నిలబెడుతుంది. సోలార్ రూఫ్‌టాప్‌లో క్రాంప్టన్ ప్రవేశం దాని మొత్తం అడ్రసబుల్ మార్కెట్‌ను రూ. 75,000-1 లక్ష కోట్ల నుండి రూ. 2 లక్షల కోట్లకు గణనీయంగా విస్తరించే విస్తృత వ్యూహంతో మిళితమై ఉంది. సంయుక్త సోలార్ పంపులు, సోలార్ రూఫ్‌టాప్‌ల విభాగం రూ. 40,000-రూ.50,000 కోట్ల పెద్ద అవకాశ పరిమాణాన్ని సూచిస్తుంది. క్రాంప్టన్ దాని విశ్వసనీయమైన మరియు నమ్మదగిన బ్రాండ్ విస్తృతమైన పంపిణీ నెట్వర్క్ ద్వారా ఈ వృద్ధిని పొందుతుంది. పెద్ద ఆర్డర్లు, సోలార్ పంపులలో బలమైన పైప్‌లైన్‌తో కంపెనీ ఇప్పటికే బలంగా ఊపందుకుంది. దీనిపై వ్యాఖ్యానిస్తూ క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ ప్రొమీత్ ఘోష్ అన్నారు. "పునరుత్పాదక ఇంధన రంగం, ముఖ్యంగా సోలార్ రూఫ్‌టాప్‌లు, భారతదేశ ఇంధన విభాగానికి ప్రగతిశీలమైన పరివర్తన అవకాశాలను అందిస్తున్నాయి. ఈ విభాగంలో క్రాంప్టన్ ప్రవేశం, సుస్థిరత పట్ల మా నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. మా దృష్టి కేవలం అధిక-పనితీరు, వినూత్న ఉత్పత్తులను అందించడం మాత్రమే కాదు, భారతదేశ గ్రీన్ ఎనర్జీ పరివర్తనలో ప్రధాన భాగస్వామిగా మారడం ద్వారా క్రాంప్టన్‌కు వేగవంతమైన వృద్ధిని సాధించడం, అలాగే దేశానికి స్థిరమైన భవిష్యత్తును నిర్మించడం తమ లక్ష్యమని చెప్పారు.

ఆర్టిఏపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం నేలతేరు గ్రామంలో కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో ఆదివారం ఆర్టిఐ అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిసిడిఓ శ్రీదేవి, సమగ్ర శిక్షా లెక్చరర్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్

హాజరై ర్యాలీ నిర్వహించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఆర్టిఏపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి షీలా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పిడిఎస్ఓ జిల్లా మహాసభను విజయవంతం చేయండి

- జిల్లా పిడిఎస్ఓ అధ్యక్షుడు విశ్వనాథ్ పిలుపు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: పౌర గ్రంథాలయంలో 15వ తేదీన జరిగే పిడిఎస్ఓ "విశాఖ జిల్లా మహాసభ"ను విజయవంతం చేయాలని పిడిఎస్ఓ జిల్లా అధ్యక్షుడు పి. విశ్వనాథ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పిడిఎస్ఓ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ఆంధ్ర యూనివర్సిటీ నేడు సమస్యలతో విలవిలలాడుతోందన్నారు. వేల మందికి విద్యను అందిస్తున్న ఈ ఉన్నత విద్యాలయం సరిపడా అధ్యాపకులు లేక డిపార్ట్మెంట్లకు డిపార్ట్మెంట్లు మూసివేతకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీకి సుమారు 111మంది ప్రొఫెసర్లు, 201 అసోసియేట్ ప్రొఫెసర్లు, 414 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు కావాలని, సంవత్సరాల తరబడి పోస్టులను భర్తీ చేయకుండా యూనివర్సిటీని నిర్వీర్యం చేసే వైపుగా అన్ని ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయని ధ్వజమెత్తారు. వేలకు వేల రూపాయల ఫీజులు కట్టుకొని విద్యార్థులు కనీసం తాగునీటికి ఇబ్బంది పడే పరిస్థితికి నెట్టబడుతున్నారని మండిపడ్డారు. నగరంలో కేవలం రెండే రెండు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండటంతో ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల నుండి ఇక్కడకు వస్తున్న విద్యార్థులకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో సీట్లు దొరకడం కష్టమవుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసి, పేద, మధ్యతరగతి వర్గాలకు విద్యను అందుబాటులోకి తీసుకురావాలి అని ఆయన అన్నారు. పిడిఎస్ఓ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ హాస్టళ్ల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. తాగునీటి సమస్య, నాసిరకమైన ఆహారం, సొంత భవనాలు లేకపోవడం, రెగ్యులర్గా హెల్త్ చెకప్‌లను నిర్వహించకపోవడం వంటి సమస్యలు విద్యార్థులను నిత్యం వెంటాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లాలోని విద్యారంగ సమస్యలపై కార్యక్రమాన్ని రూపొందించుకోవడానికి జిల్లా మహాసభను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్షులు పి.విశ్వనాథ్ అధ్యక్షతన జరిగే ఈ మహాసభకు ఆంధ్ర యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.సుబ్బయ్య, పిడిఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. భాస్కర్, జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి తదితరులు ప్రసంగిస్తారని చెప్పారు. ఈ మహాసభకు విద్యార్థి, మేధావులు, ప్రజాతంత్ర వాదులు హాజరై విజయవంతం చేస్తారని కోరుతున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సతీష్ కుమార్, జానకి, లక్ష్మణ్, ఉదయ్ కిరణ్, ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కోసం గ్రామస్తులు ఆందోళన

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని పాలవలస గ్రామంలో ప్రభుత్వ భూమిని కాపాడేందుకు గ్రామస్తులు కదం తొక్కారు. తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఆదివారం కొందరు వ్యక్తులు ఆ భూమిలో రేకుల షెడ్ నిర్మించేందుకు ప్రయత్నించగా, గ్రామస్తులు అడ్డుకుని పనులు ఆపివేశారు. గ్రామస్థుల సమాచారం ప్రకారం, సర్వే నంబర్ 82లో సుమారు 21 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గతంలో ఈ స్థలాన్ని ఇళ్ల పట్టాల కోసం కేటాయించినప్పటికీ, కొంత భాగం ఆక్రమణకు గురవుతోందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామంలో మరే ఇతర ప్రభుత్వ భూములు లేవని, ఈ స్థలమే గ్రామాభివృద్ధికి ఆధారం కావడంతో దానిని కాపాడాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ 21 ఎకరాల్లో నలుగురు ఆక్రమణదారుల పేర్లతో సుమారు 7 ఎకరాలు ఆన్లైన్ రికార్డుల్లో నమోదు కాగా, మిగతా 14 ఎకరాలు ప్రభుత్వ భూమిగానే ఉన్నట్లు సమాచారం. ఇందులో 3 ఎకరాలకు డీ పట్టా ఉందని ఒక దళిత కుటుంబం పేర్కొంటుండగా, అదే భూమిలో తాను సాగు చేస్తున్నానని భీమిలి మండలం కాపులుప్పాడకు చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి అంటున్నారు. వీరిద్దరూ తమకు న్యాయం చేయాలంటూ ఆనందపురం పోలీసులను ఆశ్రయించారు. మొత్తంగా పాలవలస ప్రభుత్వ భూమిపై గ్రామస్తులు, దళిత కుటుంబం, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి - ముగ్గురి వర్గాల మధ్య హక్కుల వివాదం తలెత్తగా, ఈ అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని గ్రామస్థులు ప్రభుత్వ భూమిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

మెట్టమీదపాలెం లే అవుట్‌లో విజయదశమి ఉత్సవం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం ఖండ గుడిలోవ సంఘ మండలం విజయదశమి ఉత్సవం మెట్టమీదపాలెం లే అవుట్‌లో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఆర్ ఎస్ ఎస్ క్షేత్ర సంఘచాలక్, అఖిల భారత విద్యాభారతి అధ్యక్షులు మాననీయ శ్రీ దూసి రామకృష్ణ మాట్లాడుతూ 100 సంవత్సరాలు పూర్తి చేసుకొని, 101వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన శుభ సందర్భంలో ఎన్నో విజయాలను సాధించి, భారతదేశాన్ని ప్రపంచంలో అగ్ర స్థానంలో నిలబెట్టటానికి జరుగుతున్న కృషి అనిర్వచనీయమని చెప్పారు. మన కుటుంబ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శనీయమని, పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం మనందరి బాధ్యత అని చెప్పారు. కార్యక్రమంలో విశాఖ మహానగర్ సహ కార్యవాహ తమ్మిన నర్సింగరావు, బాలి రవి, దుక్క అప్పలరాజు, తమ్మిన వెంకటరమణ, నాగోతి నర్సింహులు, తర్లువాడ సర్పంచ్ బి ఆర్ బి

నాయుడు, నాగోతి శ్రీనివాసరావు, పోతిన సూరిబాబు పాల్గొన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్‌లు, మాతృమూర్తులు పాల్గొన్నారు.

లోకేష్‌కు టీమిండియా గిఫ్ట్

విశాలాంధ్ర - పీఎం పాలెం: టీమిండియా ప్లేయర్స్ సంతకాలు చేసిన స్పెషల్ టీ షర్ట్‌ను ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అందుకున్నారు. మహిళ క్రికెట్ పోటీలు తిలకించడానికి ఆదివారం విశాఖ వచ్చిన లోకేష్‌ను ఆసియా కప్ టీమిండియా మేనేజర్‌గా వ్యవహరించిన పి.వి.ఆర్.ప్రశాంత్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆసియా కప్ గెలుచుకున్నందుకు లోకేష్ అభినందనలు తెలియజేయగా.. కప్ గెలుచుకున్న ఆటగాళ్ల సంతకాలతో ఉన్న టీ షర్ట్‌ను ప్రశాంత్ - లోకేష్‌కు అందించారు. స్పెషల్ టీ షర్ట్‌ను అందుకున్న తండ్రి లోకేష్‌తోపాటు కుమారుడు దేవాన్ష్ ఎంతో మురిసిపోయారు. ప్రశాంత్ భీమవరం ఎమ్మెల్యే రామాంజనేయులు కుమారుడు కాగా, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అల్లుడన్న విషయం తెలిసిందే.

మెరిపించిన గ్లో అప్ గాల

విశాలాంధ్ర - విశాఖపట్నం: సిరి మేక్ ఓవర్స్ ఆధ్వర్యంలో గ్లో అప్ గాల పేరిట విశాఖ లో తొలిసారి నిర్వహించిన మేకప్ అవార్డ్స్, మెగా మోడలింగ్ ఈవెంట్, మిరిమిట్లు గోలిపే విధంగా ఆహుతులను అలరించింది. ఆంధ్ర రాష్ట్ర నాలు మూలల నుండి విచ్చేసిన 30 మంది మోడల్స్ రాంప్ పై ఇండియన్ బ్రైడ్స్, లేహంగాస్, వెస్ట్రన్ గౌన్స్, మరియు వన్ మినిట్ సారీస్ లో మెరుపుతీగలలా నడిచారు. ఈరోజుల్లో మేక్ అప్ ఒక్క ఆవశ్యకత తెలిచేస్తూ, విశాఖ బ్రాండ్ ఇమేజ్ ను మరింత గా పెంచేయి విధంగా ఈ కార్యక్రమం వీరు మామా ఆధ్వర్యంలో నిర్వహించామని సౌమ్య తెలిపారు. మహిళా సాధికారంతే ద్వేయంగా ఇంకా మరెన్నో కార్యక్రమాలు చేపట్టే విధంగా సిరి మేక్ ఓవర్స్ ప్రణాళిక రూపొందించిందని. నవంబర్ లో లేడీస్ పిక్నిక్ సైతం చేస్తున్నట్లు వీరు మామా తెలిపారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలు గా మిస్ ఇండియా యూనివర్స్ హేమ లతా రెడ్డి, మిస్ ఒడిశా సుప్రియ, మిస్ ఆంధ్ర సరిత, అంతర్జాతీయ మోడల్ కోచ్ రోహిత్ సువ్వాడ వ్యవహారించారు.నైరా గోల్డ్ మనోజ్ మెరిపించిన గ్లో అప్ గాల సిరి మేక్ ఓవర్స్ ఆధ్వర్యంలో గ్లో అప్ గాల పేరిట విశాఖ లో తొలిసారి నిర్వహించిన మేకప్ అవార్డ్స్ మరియు మెగా మోడలింగ్ ఈవెంట్, మిరిమిట్లు గోలిపే విధంగా ఆహుతులను అల్లరించింది. ఆంధ్ర రాష్ట్ర నాలు మూలల నుండి విచ్చేసిన 30 మంది మోడల్స్ రాంప్ పై ఇండియన్ బ్రైడ్స్, లేహంగాస్, వెస్ట్రన్ గౌన్స్, మరియు వన్ మినిట్ సారీస్ లో మెరుపుతీగలలా నడిచారు. ఈరోజుల్లో మేక్ అప్ ఒక్క ఆవశ్యకత తెలిచేస్తూ, విశాఖ బ్రాండ్ ఇమేజ్ ను మరింత గా పెంచేయి విధంగా ఈ కార్యక్రమం వీరు మామా ఆధ్వర్యంలో నిర్వహించామని సౌమ్య తెలిపారు.

మహిళా సాధికారంతే ద్వేయంగా ఇంకా మరెన్నో కార్యక్రమాలు చేపట్టే విధంగా సిరి మేక్ ఓవర్స్ ప్రణాళిక రూపొందించిందని.

నవంబర్ లో లేడీస్ పిక్నిక్ సైతం చేస్తున్నట్లు వీరు మామా తెలిపారు. కార్యక్రమానికి న్యాయ నిర్నేతలు గా మిస్ ఇండియా యూనివర్స్ హేమ లతా రెడ్డి, మిస్ ఒడిశా సుప్రియ, మిస్ ఆంధ్ర సరిత, అంతర్జాతీయ మోడల్ కోచ్ రోహిత్ సువ్వాడ వ్యవహారించారు.నైరా గోల్డ్ మనోజ్, సుధా మరియు అధిక సంఖ్యలో విశాఖ వాసులు పాల్గొన్నారు.

వీరు మామ బ్రాండ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో అదరగొట్టిన గ్లామ్ రన్ వే, డాన్స్ టోపియా

విశాలాంధ్ర - విశాఖపట్నం: వీరు మామ బ్రాండ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లామ్ రన్ ఎ, డాన్స్ టోపియా కార్యక్రమ మెగా ఫైనల్ ఆహుతులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. మూడు సంవత్సరాల నుంచి పద్నాలుగు సంవత్సరాల పిల్లలు ర్యాంప్ పై ఇండియన్ ట్రెడిషన్, షాపర్స్ స్టాప్ బీచ్, అల్ట్రా స్టైలిష్ రౌండ్లలో మెరిసారు. డాన్స్ టోపియాలో సోలో, గ్రూప్ విభాగాలలో చిన్నారులు నృత్యాలతో వేదికను అదరగొట్టారు. న్యాయ నిర్ణేతలుగా హేమలత రెడ్డి, సంతోష్, ప్రీతీ వ్యవహరించారు.

అభయ్ అర్రో ప్రత్యేక ప్రదర్శన అలరించింది. ఈ చిట్టి మోడల్స్ తో ప్రత్యేక క్యాలెండరు రూపొందిస్తామని వీరు మామ తెలిపారు. విజేతలకు సిరి మెకోవర్స్ సౌమ్య, నైరా గోల్డ్ మనోజ్ అవార్డులతో పాటు కిరిటాలు బహుకరించారు.